SPOT EDITION 2PM

www.ninadam.co.in

# నినాదం

శనివారం 23-3-2024 — నిఖార్సైన జర్నలిజం

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## సంక్షోభంలో హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్

### రసవత్తరంగా హిమాచల్ రాజకీయాలు - బీజేపీలోకి కాంగ్రెస్ అనర్హత ఎమ్మెల్యేలు




**హిమాచల్ ప్రదేశ్ :**
హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలో పడింది. ఆ పార్టీకి చెందిన తిరుగు బాటు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరుతున్నట్లు తెలుస్తోంది. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు ఈ రోజు బీజేపీలో చేరనున్నారు. ఇటీవల రాజ్యసభ ఎంపీల ఎన్నిక సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీజేపీ తరుపున క్రాస్ ఓటింగ్‌కి పాల్పడ్డారు. దీంతో వారిపై అనర్హత వేటు వేశారు. ముగ్గురు ఇండిపెండెంట్లు ఆశిష్ శర్మ (హమీర్‌పూర్ నియోజకవర్గం), హోషియార్ సింగ్ (డెహ్రా), కెఎల్ ఠాకూర్ (నాలాగర్) శుక్రవారం అసెంబ్లీ కార్యదర్శి యశ్ పాల్ శర్మకు రాజీనామా సమర్పించారు. 2022 అసెంబ్లీ ఎన్నికల సమయంలో వీరికి బీజేపీ టికెట్లు నిరాకరించడంతో, ఇండిపెండెంట్లుగా పోటీ చేశారు. ఆ తర్వాత 40 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా.. ఈ ముగ్గురూ ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. అయితే, సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు తమను, తమ కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని స్వతంత్ర ఎమ్మెల్యేలు ఆరోపిస్తున్నారు. 68 మంది ఎమ్మెల్యేలు ఉన్న హిమాచల్ ప్రదేశ్ శాసనసభలో అధికార కాంగ్రెస్‌కి 40 మంది ఎమ్మెల్యేలు ఉంటే, వీరిలో ఆరుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటంతో సంఖ్యాబలం 34కి పడిపోయింది. బీజేపీకి 25 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

## మాస్కోలో దాడి మూడో ప్రపంచ యుద్ధానికి సిగ్నలా ?



మాస్కో: రష్యా రాజధాని మాస్కోలో భారీ ఉగ్ర దాడి జరిగింది. క్రాకస్ సిటీ కన్సర్ట్ హాల్‌లోకి ప్రవేశించిన ఐదుగురు దుండగులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో సుమారు 60 మంది మృతిచెందారు. మరో 100 మందికిపైగా గాయపడ్డారు. ప్రముఖ రష్యన్ రాక్ బ్యాండ్ ఫిక్‌నిక్ సంగీత కార్యక్రమంలో ఈ దాడి చోటుచేసుకున్నది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ అధికారులు వెల్లడించారు. ఈ కాల్పులకు తామే బాధ్యులమని ఐఎస్ఐఎస్ ప్రకటించింది. ఈ దాడితో భవనంపై మంటలు చెలరేగాయి. అవి క్రమంగా బిల్డింగ్ మొత్తం వ్యాపించడంతో ఆ ప్రాంతంలో నల్లటిపొగలు కమ్ముకున్నాయి. తొలుత కన్సర్ట్ హాల్‌లోకి ప్రవేశించిన దుండగులు అక్కడున్నవారిపై కాల్పులు జరిపి బీభత్సం సృష్టించారు. మ్యూజిక్ షో ముగియడంతో బయటకు వెళ్తున్న సమయంలో ఒక్కసారిగా కాల్పులు జరిపారు. అయితే ఏం జరుగుతుందో తెలియక అక్కన్నవారు సీట్ల మధ్య దాక్కున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. హాలులో చిక్కుకున్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాడికి పాల్పడినవారిలో ఒకరిని పోలీసులు పట్టుకున్నట్లు తెలుస్తున్నది. కాగా, ఈ ఘటనపై అమెరికా అధ్యక్ష భవనం స్పందించింది. ఘటన దృశ్యాలు చాలా భయంకరంగా ఉన్నాయని ఆ దేశ జాతీయ భద్రతా సలహాదారు జాన్ కిర్బీ తెలిపారు. దీనిపై ఇప్పుడే తాము ఏం మాట్లాడలేమని చెప్పారు. దాడి జరిగే అవకాశం ఉన్నట్లు తాము రష్యాను హెచ్చరించినట్లు తెలిపారు.

## ఎన్నికల ఖర్చులపై ఈసీఐ కన్ను




**దేశంలో లోక్‌సభ ఎన్నికల తేదీలు ప్రకటించబడ్డాయి. మొదటి ఓటింగ్ ఏప్రిల్ 19న, ఎన్నికల ఫలితాలు జూన్ 4న ప్రకటించబడతాయి. కాగా, ఎన్నికల ఖర్చులను నియంత్రించాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాలు జారీ చేసింది.**

**న్యూఢిల్లీ, మార్చి 23 (నినాదం న్యూస్) :** జిల్లా మేజిస్ట్రేట్‌లతో పాటు అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు (సీఈఓలు) ఏరియాను బట్టి అభ్యర్థుల ఖర్చులను నిర్ణయించారు. ఇందుకు సంబంధించి సీఈవోలందరూ ఎన్నికల సంఘానికి నివేదికలు పంపారు. నీళ్ల నుంచి పటాకుల వరకు, టీ నుంచి పబ్లిసిటీ వరకు ఖర్చుపై పరిమితి విషయంలో అభ్యర్థులు నిబంధనలు పాటించగలరా లేదా అనేది చూడాలన్నారు. అలాగే కమిషన్ ముందు ఎన్ని ఉల్లంఘన కేసులు వస్తున్నాయో పరిశీలించాలని ఆదేశించారు. వస్తువుల ధర జాబితా దీంతో అభ్యర్థులు ప్రతి పైసా బిల్లును, లెక్కను ఎన్నికల సంఘానికి ఇవ్వాల్సి ఉంటుంది. కమిషన్ సూచనల మేరకు జిల్లా స్థాయిలో అభ్యర్థులకు వస్తువుల ధరల జాబితాను విడుదల చేశారు. ఇందులో అభ్యర్థుల ఖర్చు రేట్లను కూడా ఖరారు చేశారు. ఈసారి యూపీలో టీ, సమోసా ధర రూ.10గా నిర్ణయించగా, జిలేబీ ధర కిలో రూ.150గా ఉంచారు. సింగిల్ నాన్ ఏసీ గది ధర రూ.1150, డబుల్ బెడ్ రూ.1550గా నిర్ణయించారు. దీంతో పాటు రెండు లీటర్ల శీతల పానీయం బాటిల్ ధర రూ.90, శాఖాహారం ప్లేట్ రూ.80, నాన్ వెజిటేరియన్ ప్లేట్ ధర రూ.200గా ఉంచారు. అరలీటర్ వాటర్ బాటిల్ ధర రూ.10, లీటర్ రూ.20, రెండు లీటర్ రూ.30గా నిర్ణయించారు.

**ప్రమోషన్ రేట్లు కూడా..** ఇండికా, వ్యాగన్‌ఆర్, టాటా సుమో, మారుతీ జిప్సీ నాన్‌ఏసీ ధరలను రోజుకు రూ.1100గా ఉంచగా, ఈ ఏసీ వాహనాలకు రోజుకు రూ.1210గా ఉంచారు. స్కార్పియో, టవేరా, ఇన్నోవా, బొలెరో నాన్ ఏసీ ధర రూ.1294గా, ఏసీ వాహనాలకు రోజుకు రూ.1815గా నిర్ణయించారు. ఆయిల్ లేని ట్రాక్టర్ ట్రాలీకి రోజుకు రూ.484, ఆయిల్ లేకుండా మోటార్ సైకిల్ ద్వారా ప్రచారం చేసేందుకు రోజుకు రూ.400, సైకిల్ పై ప్రచారం చేసేందుకు రోజుకు రూ.100 చొప్పున ధర నిర్ణయించారు. ఎయిర్ కండీషనర్‌తో కూడిన సింగిల్ బెడ్ రూమ్‌ల ధర రూ.1650గా, డబుల్ బెడ్ రూమ్‌ల ధర రూ.1810గా నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రాల వారీగా కమిషన్ పర్యటిస్తున్నప్పుడు ఈ రేట్లు నిర్ణయించారు. అనంతరం ప్రతి జిల్లాలో అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి నిర్ణయించిన జాబితాను కచ్చితంగా పాటించాలని సీఈవోలందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## నేను ముందే చెప్పిన

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ గురించి
- కాంగ్రెస్ పార్టీని భూ స్థాపితం చేసిన రోజున ప్రజలు బాగుపడుతారు : కేఏ పాల్



**నల్లగొండ:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అవుతుందని ముందు చెప్పాను అంటూ కామెంట్స్ చేశారు ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు కేఏ పాల్. అలాగే, కాంగ్రెస్ పార్టీని భూ స్థాపితం చేసిన రోజునే ప్రజలు బాగుపడారని పాల్ చెప్పుకొచ్చారు. కాగా, కేఏ పాల్ శనివారం నల్లగొండలో మీడియాతో మాట్లాడుతూ..'తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నన్ను చాలా సార్లు కలిశారు. తెలంగాణ ప్రజలకు నీటి సమస్య తీవ్రంగా ఉంది. కేబినెట్‌లో నీటిపారుదల శాఖ మంత్రిని మార్చాలని నేను ఎప్పుడో చెప్పాను. కోమటిరెడ్డి వెంకట రెడ్డి చాలా మాటలు చెబుతున్నాడు. రైతుబంధు డబ్బులు ఐదువేల కోట్లు ఎటుపోయాయి. వెయ్యి కోట్లకు రేవంత్ రెడ్డి అమ్ముడుపోయాడు. తెలంగాణ ఏడు లక్షల కోట్ల అప్పుల్లో కురుకుపోయింది. కాంగ్రెస్ పార్టీని భూ స్థాపితం చేసిన రోజున ప్రజలు బాగుపడుతారు. రేవంత్ గురువు చంద్రబాబు చెప్తే తెలంగాణలో కాంగ్రెస్ ఎంపీలను గెలిపిస్తాను. లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుంచి ప్రజాశాంతి పార్టీలో పోటీలో ఉంటుంది' అంటూ కామెంట్స్ చేశారు.

## సిరిసిల్లలో దారుణం..

### మహిళపై వలస కూలీల అత్యాచారం..హత్య..!



**సిరిసిల్ల, మార్చి 20 (నినాదం న్యూస్) :**
తాజాగా సిరిసిల్ల జిల్లాలో ఓ దారుణం చోటు చేసుకుంది. కూలీ పనులకు వెళ్ళిన ఓ మహిళ పై కొందరు వలస కూలీలు ఘోర అఘాయిత్యానికి పాల్పడ్డారు. వారందరూ మద్యం మత్తులో ఓ మహిళ పై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆపై ఆ మహిళను హత్య చేసి పారిపోయారు. కాకపోతే ఈ విషయం కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించిన నిందితులను పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. సిరిసిల్ల నగరంలోని అనంతనగర్‌లో ఓ ఇంట్లో బిహార్ రాష్ట్రానికి చెందిన 6 మంది భవన నిర్మాణ కార్మికులు గత 6 నెలలుగా అద్దెకు నివసిస్తున్నారు. అందులో ఓ నలుగురు వ్యక్తులు 15 రోజుల క్రితమే బిహార్‌కు వెళ్లారు. ఇది ఇలా ఉండగా రాముబ్రిక్ష సదా, రూడల్ సదా అనే ఇద్దరు బీహారీలు ఓ 4 రోజుల కిందట ఓ మహిళను వారి ఇంటికి తీసుకొచ్చారు. అయితే ఆ తర్వాత వారు కనిపించలేదు. ఇదిఇలా ఉండగా వారి ఇంట్లో నుండి ఎక్కువ దుర్వాసన రావడంతో ఇంటి యజమాని రామస్వామి పోలీసులకు సమాచారం అందించాడు. ఈమేరకు సీఐ రఘుపతి సంఘటన స్థలానికి వెళ్లి.. అక్కడ ఇంటి తాళం పగులగొట్టి చేస్తే.. ఇంట్లో రక్తపు మడుగులో మహిళ మృతదేహం కనపడింది. హత్యకి గురైన మహిళ తలపై పదునైన ఆయుధంతో దాడి చేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే వారి గదిలో మద్యం సీసాలు ఎక్కువగా ఉండటంతో మద్యం మత్తులో ఆ కార్మికులు అత్యాచారం చేసి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈ అఘాయిత్యానికి పాల్పడిన వారు మారిపోవడంతో పోలీసులు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇక హత్యకు గురైన మహిళ వేములవాడ మండలం కొడుముంజకు చెందిన ఆలకుంట రమగా పోలీసులు గుర్తించారు.

## సహాయం చేయండి మహా ప్రభో

- కాళ్ల బేరానికి వచ్చిన మాల్దీవులు అధ్యక్షుడు..
- అప్పుల బాధను తగ్గించాలని విజ్ఞప్తి
- మాల్దీవులు అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు



*మాల్దీవులు అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు భారత్‌తో కాళ్ల బేరానికి వచ్చారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ భారత్ అంటే వ్యతిరేకతతో ఉన్న మహ్మద్ ముయిజ్జు తాజాగా తన పద్ధతి మార్చుకున్నారు. ప్రస్తుతం మాల్దీవులు పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందని.. తమ దేశంపై ఉన్న అప్పుల బాధను తగ్గించాలని భారత్‌ను వేడుకుంటున్నారు. పీకల్లోతు అప్పుల్లో చిక్కుకున్న తమను కాపాడేది భారతే అంటూ తన వ్యవహార శైలికి భిన్నంగా కొత్త వాదనలు చేయడం గమనార్హం.*

**మాల్దీవులు:** మాల్దీవులు అధ్యక్షుడిగా గతేడాది ఎన్నికైన మహ్మద్ ముయిజ్జు భారత్ పట్ల తన అక్కసు మొత్తాన్ని గత కొన్ని నెలలుగా వెళ్లగక్కుతూనే ఉన్నారు. ఈ క్రమంలోనే భారత వ్యతిరేకిగా.. చైనా అనుకూల వ్యక్తిగా పేరు ఉన్న మహ్మద్ ముయిజ్జు.. చైనాతో చేతులు కలిపి భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఈ క్రమంలోనే మాల్దీవులు గడ్డపై నుంచి భారత సైన్యాన్ని వెళ్లగొట్టడం.. అదే సమయంలో చైనాతో కీలకమైన ఆయుధ ఒప్పందాలు చేసుకోవడంతో భారత్ – మాల్దీవులు మధ్య సత్సంబంధాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఈ క్రమంలోనే రెండు దేశాలు దూరం అవుతున్న తరుణంలో తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం మాల్దీవులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిందని.. సహాయం చేయండి మహా ప్రభో అంటూ భారత్‌ను అర్థిస్తున్నారు. మాల్దీవులకు భారతదేశం ఎప్పటికీ మిత్రదేశంగానే కొనసాగుతుందని ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు తాజాగా వెల్లడించారు. గతేడాది నవంబర్‌లో అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత తొలిసారి మహ్మద్ ముయిజ్జు స్థానిక మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గతేడాది మాల్దీవులు అధ్యక్షుడిగా ఎన్నికైనప్పటి నుంచి భారత్‌తో ఘర్షణకు దిగుతున్న మహ్మద్ ముయిజ్జు ఈ విధంగా మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ సందర్భంగా భారత్ నుంచి రుణవిముక్తి కోరుకుంటున్నట్లు చెప్పారు. 2023 చివరి నాటికి భారత్‌కు మాల్దీవులు దాదాపు 400.9 మిలియన్ డాలర్లు అంటే సుమారుగా రూ.34 వేల కోట్లు బకాయిపడింది. దీన్ని తిరిగి చెల్లించేందుకు తమకు ఉపశమనం కలిగించాలని ప్రస్తుతం మాల్దీవులు అధ్యక్షుడు భారత్‌ను ప్రాధేయపడుతున్నారు. ఎప్పటి నుంచో మాల్దీవులకు సాయం అందించడంలో భారత్ కీలక పాత్ర పోషించిందని మహ్మద్ ముయిజ్జు తెలిపారు. మాల్దీవుల్లో పెద్ద మొత్తంలో ప్రాజెక్టులను భారత్ నిర్మించిందని గుర్తు చేసుకున్నారు. రెండు దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదని తెలిపారు. ఈ క్రమంలోనే భారత్ నుంచి తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించేందుకు మాల్దీవులకు ఉపశమనం కలిగించాలని ఈ సందర్భంగా భారత్‌ను కోరారు. అయితే మాల్దీవుల్లోని గత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు, అనుసరించిన విధానాల వల్ల భారత్ నుంచి తీసుకున్న అప్పులు భారీగా పేరుకుపోయాయని పేర్కొన్నారు. ఈ అప్పులు చెల్లించేందుకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ భారత్‌తో చర్చలు జరుపుతున్నట్లు ముయిజ్జు వెల్లడించారు. ఈ సందర్భంగానే ప్రస్తుతం మాల్దీవుల్లో భారత్ నిర్మిస్తున్న ఏ ప్రాజెక్టుకు కూడా తమ ప్రభుత్వం అడ్డంకులు కలిగించదని స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా ఆ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సహకరిస్తామని ముయిజ్జు తేల్చి చెప్పారు. ఇక ఇదే విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీతో దుబాయి వేదికగా జరిగిన కాప్ 28 సదస్సు సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న వేళ.. మహ్మద్ ముయిజ్జు చేసిన వ్యాఖ్యలు తీవ్ర ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మానవతాసాయం కింద మాల్దీవుల్లో భారత్ గత కొన్నేళ్లుగా అత్యవసర వైద్యసేవలు అందిస్తోంది. అయితే ఆ సిబ్బంది అంతా మే 10 వ తేదీ లోపు తిరిగి భారత్ వెళ్లిపోవాలని గత కొన్ని నెలలుగా ముయిజ్జు డిమాండ్ చేస్తున్నారు. ఈ సేవల కోసం శ్రీలంకతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు కూడా చేస్తున్నారు.

## ప్రణీత్ రావు కేసులో... కీలక మలుపు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రణీత్ రావు ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్ ఆధారంగా ఏకకాలంలో 10 చోట్ల సోదాలు





**హైదరాబాద్, మార్చి 23 (నినాదం న్యూస్) :**
మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసుకు వ్యవహారంలో మాజీ పోలీసు అధికారుల ఇళ్లలో సోదాలు చేస్తున్నారు అధికారులు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు పలువురు ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఇంటెలిజెన్స్ మాజీ ఎస్పీ భుజంగరావు, ఎస్ఐబి డీఎస్పీ తిరుపతన్న ఇళ్లలో సోదాలు చేపట్టారు అధికారులు. హైదరాబాద్ సిటీ మాజీ టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు ఇంట్లోనూ సోదాలు నిర్వహిస్తున్నారు. పంజాగుట్ట పోలీసులు ఏకకాలంలో 10 చోట్ల సోదాలు నిర్వహిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రణీత్ రావు ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్ ఆధారంగా ఈ సోదాలు నిర్వహిస్తున్నారు పోలీసులు. ఓ న్యూస్ చానల్ ఎండీ శ్రవణ్ రావు ఇంట్లో కూడా పోలీసులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే, శ్రవణ్ రావు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకటి రెండు రోజుల్లో ఫోన్ ట్యాపింగ్ కేసులో మరికొన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

## 50 లక్షలు సీజ్

### గజ్వేల్‌లో భారీగా పట్టుబడ్డ నగదు



**గజ్వేల్, మార్చి 23 (నినాదం న్యూస్) :**
గజ్వేల్ పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న నగదు భారీగా పట్టుబడింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చు రత్నాకర్ అనే వ్యక్తి ఓ కారులో (టీఎస్36సీ 0198) రూ.50 లక్షల నగదును పోలీసులు గుర్తించారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రూ.50 వేలకు మించి నగదును ప్రజలు తమవెంట తీసుకెళ్లకూడదని గజ్వేల్ సీపీ అనురాధ సూచించారు. ఎక్కువగా తీసుకెళ్లినట్లయితే దానికి సంబంధించి సరైన పత్రాలు వెంబడి ఉంచుకోవాలన్నారు. లేనట్లయితే ఆ మొత్తాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. డబ్బులను ఐటీ డిపార్ట్‌మెంట్‌కు అప్పగిస్తామని, బాధితులు సరైన ధ్రువపత్రాలు చూపించి వాటిని రిలీజ్ చేసుకోవచ్చని తెలిపారు.